రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

# తెలంగాణ తల్లికి జేజేలు

## కలెక్టరేట్ల వద్ద విగ్రహాల ఆవిష్కరణ

**వికారాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆవిష్కరణ అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సంఘం లక్ష్మీబాయి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు చూపరుల ను ఎంతగానో ఆకర్షించ బడ్డాయి.

**రాష్ట్ర ఫలాలు ప్రజలకు అందేలా చూడాలి : కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 9 ప్రభాతవార్త :** రాష్ట్ర ఫలాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలనీ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ లో తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ (కలెక్టరేట్) ఆవరణలో తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నూతనంగా నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... స్వరాష్ట్రంలో జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని కలెక్టర్ అన్నారు. మలి విడత తెలంగాణ ఉద్యమంలో వివిధ వర్గాల ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు కూడా

మిగతా 2లో

# గందరగోళంగా ఓటర్ల జాబితా

## మృతల పేర్లూ యథాతథం

## ఎవరి ఓట్లు ఎక్కడో తెలియక ఓటర్లలో అయోమయం

**మాడ్గుల, డిసెంబరు 9, ప్రభాతవార్త:** మారుమూల మండలంలోని పలు గ్రామపంచాయతీల ఓటరు జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయి. జాబితాల సవరణలో స్థానిక బీఎల్‌ఓలతో పాటు పంచాయతీల కార్యదర్శులు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జాబితాలో అనేక తప్పులు ఉన్నాయి. పలు పంచాయితీల ఓటరు జాబితాలలో వివాహం చేసుని అత్తవారింటికి వెళ్ళిన యువతుల పేర్లు, మృతుల పేర్లు యధావిధిగా ఉంచగా, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ పేర్లను ఒకే చోట ఉంచకుండా వివిధ వార్డుల ప్రచరించారు. దీంతో పలువురు ఓటర్లు తమ తమ పేర్లు ఏ వార్డులలో ఉన్నయో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అదే విధంగా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాను చూసి విస్తుపోతున్నారు. మండలంలోని అవురుపల్లి పంచాయతీ ఓటరు జాబితా తప్పుల తడకగా ఉంది. మొదటి వార్డు మినహాయిస్తే మిగతా 9 వార్డు లోని ఓటర్ల పేర్లు ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు అక్కడో.. ఇక్కడో విసిరి పారేసినట్లు చిందరవందరగా ఉన్నాయి. ఒకే కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉంటే భార్య

మిగతా 2లో

**ముగిసిన సంబురం**




తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ చర్చాగోష్ఠిలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్ర పరిశ్రమ రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా, అల్లు అరవింద్, సురేష్ బాబు, శామ్ ప్రసాద్ రెడ్డి, రితేష్ దేశముఖ్, జెనీలియా, జోయాఅక్తర్





ముగింపు సందర్భంగా డ్రోన్ షో.. బాణసంచా

# పంట పొలంలో గంజాయి సాగు..!

## ఎక్సైజ్ పోలీసుల దాడులతో వెలుగులోకి..

## 108 గంజాయి మొక్కలు, కిలోన్నర ఎండు గంజాయి స్వాధీనం

**తాండూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు పరిధిలో గుట్టుగా సాగు చేస్తోన్న గంజాయి వనం రహస్యం బట్టబయలైంది. బర్వాద్ గ్రామంలో ఒక రైతు... ఎవరికీ అనుమానం రాకుండా... తన పొలం మధ్య గంజాయి మొక్కల సాగు చేపట్టాడు. ఒకటి, రెండు కాదు... ఏకంగా 108 మొక్కలు. వీటి విలువ సుమారు రూ. 11 లక్షలు అని తెలుస్తోంది. జిల్లా ఎక్సైజ్ అధికారులకు సదరు రైతు చేస్తున్న ఘన కార్యం గురించి సమాచారం అందడంతో... అతడి పొలానికి వెళ్లి... గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మంగళవారం తాండూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సూపరిండెంట్ విజయభాస్కర్ మీడియాకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామంలో సర్వే నెం. 333అ 1/3లో ఎర్రోళ్ల పెంటయ్య అనే వ్యక్తి తన పొలంలో గంజాయి మొక్కలను సాగు చేయడంతో పాటు విక్రయిస్తున్నాడు. అయితే, విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్ ఆదేశాలతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆద్వర్యంలో డిటీఎఫ్ వికారాబాద్, ఎస్‌హెచ్ఓ తాండూరు ఎక్సైజ్ అధికారులు సిబ్బంది మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో బార్వాద్ గ్రామంలో సర్వే నెం. 333అ 1/3లో ఎర్రోళ్ల పెంటయ్య పొలంలో 108 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ విజయభాస్కర్ వెల్లడించారు. అదేవిదంగా కిలోన్నర ఎండు గంజాయి కూడ గుర్తించి స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎర్రోళ్ల పెంటయ్యతో పాటు ఆయన కుమారుడు ఎర్రోళ్ల ప్రభాకర్ కలిసి గంజాయి సాగు చేస్తున్నట్లు వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తండ్రి పెంటయ్య పారిపోవడంతో ఆయన కూమారుడు ప్రబాకర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ సిఐ శ్రీనివాస్, తాండూరు ఇంచార్జ్ సిఐ ఎన్.రాణి, డిటిఎఫ్ ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, తాండూరు ఎస్‌హెచ్ఓ నిజాముద్దీన్, రవికుమార్, సిబ్బంది శివప్రసాద్, హనుమంతు, రవికిరణ్, మహేష్, ఆసిఫా బేగం, రాధిక, భీమయ్య, రమేష్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

# ఆఖరి ఆశలు



- రహస్య మంతనాలు
- జోరుగా తాయిలాల పంపిణీ
- ఓటర్ల ఇళ్లకు అభ్యర్థుల క్యూ
- పొలాలు అమ్మి మరీ ప్రచార ఖర్చు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

**కొడంగల్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడుత ఎన్నికలు గురువారం కొనసాగనుండడంతో మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరదించారు. గత పది రోజులుగా గ్రామాల్లో అభ్యర్థులు హోరెత్తించారు. కొన్ని గ్రామాల్లో మద్యం, మాంసం పంచుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగించారు. మండల పరిధిలోని చిన్న నందిగామలో ఓ అభ్యర్థి ఆరు మేకపోతులతో గ్రామస్తులకు దావతు ఇవ్వడం విశేషం. అలాగే అంగడిరైచూర్‌లో గ్రామంలో ఓ అభ్యర్థి మంగళవారం చికన్ బిర్యానీతో ఓటర్లకు విందులు ఏర్పాటు చేయడం ప్రత్యర్థులను కలవరపాటుకు గురిచేసింది. వారం పది రోజుల పాటు గ్రామాల్లో మద్యం ఏరులై పారిందనడంలో అతిశయోక్తి లేదు. అలాగే మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో ఓ అభ్యర్థి ఏకంగా పది రోజుల పాటు గ్రామస్తులకు ప్రతిరోజు భోజనాలు ఏర్పాటుతో మద్యం పంపిణీతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. ఎంత దావత్‌లు ఏర్పాటు చేసినా ఇంకా ఎక్కడో అనుమానంతో డబ్బుల పంపిణీకి అభ్యర్థులు తెరలేపినట్లు సమాచారం. గ్రామాల్లో అభ్యర్థులు ప్రత్యర్థుల ఎత్తులను పసిగడుతూ పైఎత్తులతో చిత్తులు చేసేందుకు ప్రయత్నించారు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో పోటీ రసవత్తరంగా మారడంతో అభ్యర్థులు ఎత్తులకు పైఎత్తులు వేస్తు ఓటర్లను తమవైపు ఆకర్షించేందుకు వినూత్నంగా ప్రయత్నాలు చేయడం కొసమెరుపు. అలాగే మండల పరిధిలోని హస్నాబాద్, అంగడరైచూర్, పర్సాపూర్, రావులపల్లి గ్రామాల్లో అధికార పార్టీ మద్దతుదారులతో పాటు రెబల్స్ బెడద అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. మంగళవారం

మిగతా 4లో




# తొలి ఘట్టం ప్రచారానికి తెర

1,912 వార్డులకు గురువారం ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ కోసం 2,351 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. 2,743 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1,607 టీమ్ మెంబర్లు, 288 మంది త్రిసభ్య టీములు, 17 ఫోర్ మెంబర్స్ టీమ్‌లు, మరో 1,912 మంది సిబ్బందిని విధులకు కేటాయించారు. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్ బాష మంగళవారం సమీక్షించారు. అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో మంగీలాల్, డీపీవో జయసుధ, నోడల్ అధికారి మాధవరెడ్డి, డీఈవో రేణుకాదేవి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకోవలని సూచించారు. మరోవైపు పోలీసుశాఖ కూడా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. తొలి దశలో 53 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. 1,100 మంది పోలీసులు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వు, సివిల్, ప్రత్యేక బృందాలు పహారా కాయనున్నాయి. సమస్యాత్మక గ్రామాల్లో 1 ప్లస్ 2 సిబ్బంది, సాధారణ కేంద్రాల్లో ఇద్దరు పోలీసు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. బందోబస్తు మరింత పటిష్ఠమంతంగా ఉండాలన్నారు. మద్యం, డబ్బు పంపిణీ చేసినా ఓటర్లను ప్రలోభపెట్టినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టుల వద్ద, సున్నితమైన ప్రాంతాలలో నిఘా పెట్టాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారంపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ఎన్నికల నియమావళి కఠినంగా అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు.

## 225 పంచాయతీలకు రేపే మొదటి దశ ఎన్నికలు

- 8వేల మందికి పైగా సిబ్బంది నియామకం
- 53 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు
- 1,100 మంది పోలీసుల పహారా
- చట్టాన్ని అతిక్రమిస్తే దండన తప్పదు
- స్వేచ్ఛగా ఓటు వేయండి : కలెక్టర్, ఎస్పీ

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చూస్తుండగానే గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచార ఘట్టానికి తెర పడింది. మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తాండూరు, కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం గడువు ముగిసింది. మద్యం దుకాణాలను మూసివేశారు. బుధవారం ఎన్నికల సామగ్రి పంపిణీ చేయనున్నారు. మొదటి దశ పోలింగ్ కోసం 8 మండలాలలో 262 గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటికే 37 జీపీలు ఏకగ్రీవమైనాయి. మిగిలిన 225 గ్రామ పంచాయతీలకు,



## మేనేజర్ అని నమ్మితే..

# రూ.7.5 లక్షలు చోరీ

## దుర్గా స్టీల్ కంపెనీలో కలకలం

## నిందితుడు అరెస్ట్

**షాద్‌నగర్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండలం ఎలుకట్ట శివారులో గల దుర్గా స్టీల్ కంపెనీ ఉద్యోగి తిన్న ఇంటి వాసాలకే కన్నం వేశాడు. ఎసిపి ఎస్ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. ఫరూక్ నగర్ మండలం ఎలుకట్ట శివారులో ఉన్న దుర్గా స్టీల్ కంపెనీలో కమల్ కిషోర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈనెల మూడో తేదీన ఏడున్నర లక్షల రూపాయల నగదును కంపెనీ ఎండీ రాజ్ కుమార్ తన మేనేజర్ చేతికిచ్చి టేబుల్ డెస్క్‌లో సెంట్రల్ లాక్ చేయించారు. మరుసటి రోజు కమల్ కిషోర్ ఫోన్ చేసి నగదు కనిపించడం లేదని చెప్పాడు. రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేశారు. మేనేజరే నిందితుడుగా ఆధారాలు సేకరించి నిర్ధారించారు. కమల్ కిషోర్ వర్మను అరెస్టు చేశారు. కంపెనీలో పనిచేసే మరో కార్మికుడు బబ్లు ద్వారా తాళం చెవి తీసుకొని ఏడున్నర లక్షల రూపాయలను చాకచక్యంగా మేనేజర్ తస్కరించాడని పోలీసులు తెలిపారు. ఏడున్నర లక్షల రూపాయలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం ఎసిపి లక్ష్మీనారాయణ మీడియాకు తెలిపారు. ఈ కేసులో చాకచక వ్యవహరించిన సిఐ విజయకుమార్, డిఐ వెంకటేశ్వర్లు తదితర సిబ్బందిని అభినందించారు. మిగతా సిబ్బందికి ఉన్నతాధికారులకు సిఫార్సు చేసి రివార్డు ఇప్పించనున్నట్లు ఎసిపి తెలిపారు.

## పిడిఎస్ కేసు ఎత్తేయాలా..

# రూ. 20 వేలు ఇచ్చుకో

## నెలకు రూ.5వేలు చొప్పున డీలర్ల నుంచి గుంజుడు

## సివిల్ సప్లై అధికారి డిమాండ్

## బాధితుని ఫిర్యాదుతో ఎసిబి అరెస్ట్

**షాద్‌నగర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం అన్నారం గ్రామంలో రేషన్ దుకాణాన్ని తెరిచేందుకు, పిడిఎస్ కేసును మాఫీ చేసేందుకు ఓ రేషన్ డీలర్ వద్ద రూ 20 వేల లంచాన్ని డిమాండ్ చేసిన జిల్లా సివిల్ సప్లై అధి కారి (ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసిల్దార్) హనుమ రవీందర్ నాయక్‌ను మంగళవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం రంగారెడ్డి జిల్లా ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయం కొంగరకలాన్‌లో సివిల్ సరఫరాల డిప్యూటీ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న హనుమ రవీందర్ నాయక్ ఫరూఖ్ నగర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యాదగిరిను రేషన్ దుకాణాన్ని తెరిచేందుకు, డీలర్ పై నమోదైన పిడిఎస్ బియ్యం కేసును మాఫీ చేసేందుకు రూ. 20 వేలు లంచాన్ని డిమాండ్ చేశాడు. రేషన్ డీలర్ వద్ద లంచాన్ని తీసుకుంటూ రవీందర్ నాయక్ మంగళవారం సాయంత్రం షాద్ నగర్ పట్టణంలో చౌరస్తా సమీపంలో రాఘవేంద్ర హోటల్ వద్ద ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పట్టుబడిన రవీందర్ నాయక్ వద్ద సంఘటన స్థలంలోనే రూ. 20 వేలు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఎస్ఐబి కోర్టులో హాజరు పరిచ నున్నట్టు ఎసిబి అధికారులు తెలి పారు. ఈ వ్యవహా రంలో కేసు మరింత దర్యాప్తు చేస్తామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేసి తెలియజేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోపెంగ ఉంచుతామని ఈ సందర్భంగా వారు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. డబ్బుల కోసం వేధిం చాడు..అన్నవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యాద గిరి మీడియాతో మాట్లాడుతూ..పిడిఎస్ రైస్ కేసులో తన షాపు సీజ్ చేయడం జరిగిందని షాపు మళ్లీ యధావిధిగా కొనసాగించడానికి 20వేల రూపాయలు అధికారి రవీందర్ నాయక్ లంచం అడిగాడని పేర్కొన్నారు. అంతేకాదు ప్రతినెల షాపుకు 500 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రేషన్ షాపుల్లో



మిగతా 4లో

## కాంగ్రెస్‌కు ప్రచారం చేస్తున్నారని

# బిఆర్ఎస్ నేతపై దాడి

## తీగపూర్‌లో ఉద్రిక్తత - గులాబీ దళంపై బాధితుడి ఫిర్యాదు

**కొత్తూరు, డిసెంబరు 9, ప్రభాతవార్త;** కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేండే కృష్ణ యాదవ్‌పై దాడి జరిగింది. బిఆర్ఎస్‌కు చెందిన సుమారు 20 నుండి 30 మంది వరకు తనపై దాడి చేశారని కొత్తూరు పోలీస్ స్టేషన్లో కృష్ణ యాదవ్ ఫిర్యాదు చేశారు. తీగపూర్ గ్రామంలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి కాకుండా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తూ ఆయన విజయానికి కృషి చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన బాలయ్య తదితరులు కృష్ణ యాదవ్‌ను నిలదీశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. అనంతరం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్ వాటర్ ట్యాంక్ వద్ద దాదాపు 30 మంది తనపై దాడి చేశారని కృష్ణయాదవ్ చెప్పారు. తన రాజకీయ జీవితంలో



దాడికి గురైన బిఆర్ఎస్ నేత కృష్ణయ్య

మిగతా 4లో




## పంచాయతీ ఎన్నికల్లో కీలకంగా మారుతున్న కొత్త ఓటర్లు

## రాజకీయంగానూ క్రియాశీలకం- చౌడపూర్ మండలంలో 50 మందికి పైగా నామినేషన్లు - మండల కేంద్రంలో ఆరుగురు అభ్యర్థుల మధ్య పోటీ

## 5 గ్రామాల్లో ఏకగ్రీవాలకు అవకాశం - 4 గ్రామాల్లో హోరాహోరీ?

**చౌడపూర్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో యువత కీలకంగా మారనుంది. దీంతో అభ్యర్థులు యువతపై వరాల జల్లు కురిపిస్తున్నారు. పలు చోట్ల వారు సర్పంచ్, వార్డ్ మెంబర్ల స్థానాల్లో పోటీకీ సైతం సిద్ధమయ్యారు. సహజంగా ప్రశ్నించడం, నిరసన కార్యక్రమాలకే పరిమితమవుతున్న యువతీయువకులు నేరుగా రాజకీయాల్లోనూ క్రియిశీలకంగా ఎదగడానికి ప్రయత్నం చేస్తుడటం ఆకస్తికరంగా మారింది. చౌడపూర్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా..మొత్తం ఓటర్లు 25 వేల మంది ఉన్నారు. వారిలో దాదాపు 9 వేల మంది ఓటర్లు 35 సంవత్సరాలలోపు వారే..

సర్పంచి స్థానాలకు 139 నామినేషన్లు, 202 వార్డుమెంబర్ల స్థానాలకు 386 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీరిలో 22-30ఏళ్ల లోపు యువతీ యువకులు 21 మంది అభ్యర్థులు ఉన్నారు. 30-32 ఏళ్ల లోపు 8 మంది, 33-35ఏళ్ల లోపు 10 మంది, 36-38 ఏళ్ల లోపు 12 మంది, 38-40ఏళ్ల లోపు ఐదుగురు చొప్పన పోటీల్లో నిలవగా మిగతా వారంతా 40 ఏళ్ల పైబడినవారే. మరో వైపు విద్యావంతులు కూడా పోటీకీ ఆసక్తి చూపడం విశేషం. మంగళవారం ఉపసంహరణకు చివరి తేది అవ్వడంతో కొన్ని గ్రామాల్లో ఎన్నికల పోటీ నుండి తప్పుకోవడానికి ఒకరిద్దరు మాత్రమే విత్ డ్రా చేసుకున్నారు. మండల కేంద్రం అయిన చౌడపూర్ గ్రామ పంచాయతీలో దాదాపు ఆరుగురు సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం కనిపిస్తోంది. మండలంలో ఐదు గ్రామాల్లో సర్పంచుల ఎన్నిక ఏకగ్రీవాలకు అవకాశం ఉన్నట్టు సమాచారం. వాల్యానాయక్ తండా, మక్తవెంకటాపూర్, కిష్టంపల్లి, మల్కపూర్, బంగ్రంపల్లి గ్రామాలలో ఏకగ్రీవాల కోసం చర్చలు జరిగాయని చెబుతున్నారు.



సర్పంచ్ పదవుల కోసం మందిపాల్, మరికల్, చాకల్ పల్లి గ్రామ అభ్యర్థుల్లో ద్విముఖపోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి. మందిపాల్ గ్రామంలో బలమైన అభ్యర్థులన్నందున మండలంలో బడా నేతలు ఫలితంపై ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గుర్తులు కేటాయించక ముందే అభ్యర్థులు తమకు మద్దతు తెలపాలని ఓటర్లకు దగ్గరవుతున్నారు.

# నా ప్రమేయం లేకుండా నామినేషన్ విత్ డ్రా చేశారు

## కలెక్టర్‌కు ఆత్మార్ సర్పంచ్ అభ్యర్థి ఫిర్యాదు

**పెద్దేముల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తన ప్రమేయం లేకుండా నామినేషన్ విత్ డ్రా చేసారని, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆత్మార్ సర్పంచ్ అభ్యర్థి బ్యాగరి రాజు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దేముల్ మండలం ఆత్మార్ గ్రామ పంచాయతీకి ఈ నెల 11న జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే గ్రామస్తులు అందరు కలిసి పంచాయతీకి ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేయాలని భావించారు. సర్పంచ్ పదవికి నామినేషన్లు వేసిన ఆరుగురు నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఆత్మార్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించారు. అనుకోని విధంగా రెండు రోజుల్లో ఎన్నికలు ఉండగా మంగళవారం సర్పంచ్ అభ్యర్థి బ్యాగరి రాజు తాను తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకోలేదని, తనకు తెలియకుండానే తన అన్న ద్వారా నామినేషన్‌ను విత్‌డ్రా చేయించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో

మిగతా 2లో

## అవకాశం కల్పించండి..గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తా

**: సర్పంచ్ అభ్యర్థి నేనావత్ భారతి రవీందర్**

**కేశంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త :** సుందరాపురం గ్రామ సర్పంచ్‌గా తనను గెలిపించాలని బి ఆర్ ఎస్ పార్టీ మద్దతుతో బరిలోదిగిన సర్పంచ్అభ్యర్థి నేనావత్ భారతి రవీందర్ కోరారు. మంగళవారం సుందరపురం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కోరారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి మరోసారి మనకు అవకాశం కల్పించా లన్నారు. సర్పంచ్‌గా గెలిస్తే గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని భారతి అన్నారు.


సుందరపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతలు

## సర్పంచిగా గెలిపిస్తే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**కొత్తపేట సర్పంచ్ అభ్యర్థి పట్లూరి హైమావతి జగదీశ్వర్**

**కేశంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త :** ఆశీర్వదించి అవకాశాన్ని ఇచ్చి నన్ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతా అని సర్పంచ్ అభ్యర్థి పట్లూరి హైమావతి జగదీష్ అన్నారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తపేట గ్రామఅభివృద్ధి కోసం తమ కుటుంబం చేసిన సేవలను గుర్తించి ప్రజలు తమను ఆశీర్వదించి గెలిపించాలన్నారు. మంగళవారం కొత్తపేట గ్రామంలో తమ మద్దతు దారులతో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిం చారు. సర్పంచ్ ఎన్నికల్లో తనకు కేటాయించిన బ్యాటు గుర్తుకు ఓటు వేసి సర్పంచిగా భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సర్పంచ్‌గా గెలుస్తే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామ అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తానని అన్నారు. ఈ గ్రామంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గత 50 సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజల సంక్షేమానికి, అభివృద్ధి కోసం చేసిన సేవలను గుర్తించి తనను సర్పంచ్‌గా ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలను వేడుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ అభ్యర్థి పట్లూరి హైమావతి జగదీశ్వర్

## సర్పంచ్‌గా గెలిపిస్తే మీ మధ్యలోనే ఉంటూ సేవ చేస్తా

**సర్పంచ్ అభ్యర్థి ఎదిరే నాగేశ్వర్**

**కేశంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త :** భోధునం పల్లి గ్రామ సర్పంచ్‌గా నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని హంగుల్లో తీర్చిదిద్దుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించి గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి ఎదిరే నాగేశ్వర్ అన్నారు. మంగళవారం గ్రామంలో తన మద్దతుదారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. తనకు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటువేసి నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సర్పంచ్‌గా గెలిపిస్తే మీ మధ్యలో ఉంటూ అందరికీ సేవ చేసుకునే అదృష్టాన్ని కల్పిస్తారని ఆయన అన్నారు.


భోధునం పల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

## ఆశీర్వదించి ఓటు వేయండి గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా

**బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్**

**కేశంపేట, డిసెంబరు 9, ప్రభాతవార్త :** నన్ను ఆదరించి మీ బిడ్డగా మీ అమూల్యమైన ఓటును కత్తెర గుర్తుకు వేసి సర్పంచ్‌గా గెలిపిస్తే కేశంపేట గ్రామాన్ని అభివృద్ధిచేసి చూపిస్తానని సర్పంచ్ అభ్యర్థి బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎంపిడిఓ కార్యాలయానికి, ఎమ్మార్వో కార్యాలయానికి, పోలీస్ స్టేషన్, బ్యాగ్‌కు వివిధ రకాల పనుల నిమిత్తం కేశంపేటకు వస్తూ ఉంటారు. వచ్చిన ప్రజలకు మరుగుదొడ్ల లేక ఇబ్బందులు పడుతూ ఉంటారు. మండల కేంద్రంలో బస్సు కోసం వేచి ఉన్న ప్రజలకు బస్టాండు లేకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ముఖ్యంగా విద్యార్థులు, ముసలి వాళ్లకు ఇబ్బందులు కలుగుతూ ఉంటాయి. మీరు నన్ను ఆశీర్వదించి సర్పంచ్‌గా గెలిపిస్తే పదవి చేపట్టిన వెంటనే మరుగుదొడ్లు బస్టాండు నిర్మించే కార్యక్రమం చేపడతామన్నారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా వాళ్ల సమస్యలు నా సమస్యగా దగ్గరుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామానికి సేవ చేసే అదృష్టం కల్పిస్తారని ఆమె తెలిపారు. ప్రజల ఆదరణ చూస్తే ఖచ్చితంగా గెలిపిస్తారని నమ్మకం ప్రజలపైనా నాకు నమ్మకం ఉందని ఆమె అన్నారు .


బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్

## ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలు నమ్మద్దు

**..అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించాలి**

**..ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ప్రతిపక్ష పార్టీలు చెప్పె మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి పడగల్ల బుజ్జమ్మకు మద్దతుగా నిర్వహించిన ప్రచారర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలనలో మహిళలకు మొదటి స్థానం లభించిందని అన్నారు. అంతేగాకుండా సంక్షేమ పథకాలలో మహిళల వాటనే ఎక్కువని అన్నారు. రెండేళ్ళ పాలనలో రేషన్‌కార్డులు, సన్నబియ్యం, ఉచిత బస్సు, 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ చీరలు, రుణమాఫీ తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. పదవుల కోసం పార్టీ మారే వాళ్ళు కావాలాప్రజల కోసం పనిచేసే బుజ్జమ్మ కావాలా ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు దారాసింగ్, టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, నాయకులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, శోభారాణి, జితేందర్‌రెడ్డి, విద్యాసాగర్, కోహీర్ రవి, డివై నర్సిములు,ఆనందచారీ, గోపాలక్రిష్ణ, ఎర్రబాలప్ప, సి,రాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి

**..బిఆర్ఎస్ హయంలోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి ..మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి**

**పెద్దేముల్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఆరు గ్యారేంటీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు పంచాయతీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం మండలంలోని పెద్దేముల్, కందనెల్లి, రె గొండి, గాజీపూర్, అడ్కిచెర్ల, పాషపూర్,తట్టెపల్లి తదితర గ్రామాలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇందిరమ్మ ఇళ్ళ పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలను మళ్ళీ మోసం చేయడానికి చూస్తున్న కాంగ్రెస్‌కు తగిన బుద్ది చెప్పాలని అన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అందుకు ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రుక్మాపూర్ రమేష్, హైదర్, జనార్ధన్‌రెడ్డి, వీరప్ప, ఆనందలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ శివకుమార్, నాయకులు గాజీపూర్ సాయులు గౌడ్, మహిపాల్‌రెడ్డి , డివై నర్సిములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

## ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

**..మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాకు వినతిపత్రం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఆరుజిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ చింతల్ ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాకు ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి వినతిపత్రాన్నిఅందజేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు వారు విచ్చేసి జిల్లా అదనపు కలెక్టర్‌ను ఛాంబర్‌లో సంఘం ప్రతినిధులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. చింతల్‌లోని సర్వేనెంబరు 259లో ఉన్న 40గుంటల భూమిలో 1500గజాల స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షులు జూలూరి విజయ్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభురాజుగుప్తా, కోశాధికారి ఇల్లెందుల కృష్ణకుమార్, గౌరవసలహాదారు ఇడుకుల కృష్ణమూర్తి, సభ్యులు నేతి జగన్నాధం, వీరేందర్, నారాయణప్రసాద్, శ్రీనివాస్, ఆంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ చింతల్ ఆర్యవైశ్య సంఘంనకు స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాకు వినతిపత్రం అందజేసిన ఆర్యవైశ్య సంఘం సభ్యుల దృశ్యం

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 9, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 10గంటలకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అదనపు కలెక్టర్ రాధికగుప్తా విచ్చేసి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద తెలంగాణ తల్లి విగ్రహాల ఆవిష్కరణలు, ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలులో భాగంగ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణను పురస్కరించుకుని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలపించిన ప్రభుత్వ ప్రజా పాలన, సంక్షేమంపై అందరిని ఆలరించాయి. తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణ, ఆ తరువాత ఎలాంటి ప్రసంగాలు లేకుండా విగ్రహం వద్ద అధికారుల,సిబ్బంది గ్రూప్ ఫోటోలతో కార్యక్రమం ముగిసింది.


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా,పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా అధికారులు,సిబ్బంది తదితరుల దృశ్యం

# ఎన్నికలకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు

**..షాద్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ హెచ్చరిక**
**..ప్రశాంత వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు**
**..ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించం**
**..డబ్బుమద్యం పంపిణీ చేస్తే చర్యలు తప్పవు**

**షాద్‌నగర్,డిసెంబరు 9, ప్రభాతవార్త :** గామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవచ్చని, ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఎన్నికల నియమాలని అనుసరిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని షాద్ నగర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సిఐ విజయకుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల రోజున ఎలాంటి వర్గం లేదా వ్యక్తుల ఒత్తిడికి లొంగవద్దని సూచించారు. అమాయక ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు డబ్బుమద్యం, పంపిణీలు, గుంపులుగా తిరుగుతూ ఉద్రిక్తతలు రేపే చర్యలు గమనించిన వెంటనే సంబంధితులపై కేసులు నమోదు చేస్తామని సీఐ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో 40510 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, మొత్తం 500 మంది పోలీసు సిబ్బంది పహార కాస్తారని తెలిపారు. అదేవిధంగా ఇద్దరు ఏసీపీలు, ఆరు మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు తదితర సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని తెలిపారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘించిన లేదా ఆటంకపరిచిన అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ విజయకుమార్ హెచ్చరించారు.



## బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే భూస్థాపితమే

**-మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి**
**-కాంగ్రెస్ మీ అందరి కల్పవల్లి**
**-పల్లెను రక్షించేది ఈ కన్నతల్లి**

**షాద్‌నగర్, డిసెంబరు9 ,ప్రభాతవార్త:** గోరి బ్రదర్స్ తల్లి షమీమ్ బేగంను గెలిపించాలని వినతి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పీర్లగూడను అభివృద్ధి చేస్తాం కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి షమీమ్ బేగం గెలుపు ఖాయం మీరు ఏది కోరిన అందించి మిమ్మల్ని అభివృద్ధి వైపు నడిపించే కాంగ్రెస్ ఓ కల్పవల్లి.. పల్లెకు ప్రగతి వెలుగులు పంచి మీ అందరినీ రక్షించేది ఈ కన్న తల్లి.. అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అన్నారు. ఫరూక్ నగర్ మండలం పీర్లగుడా గ్రామంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరి బ్రదర్స్ కన్నతల్లి షమీమా బేగంను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారంలో చివరి రోజు షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే చెన్నయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ భూస్థాపితం అయిన పార్టీ అని, ఆ పార్టీని అది బలపరిచిన అభ్యర్థులను నమ్ముకుంటే భవిష్యత్తు అంధకారమే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల విషయంలో సీరియస్ గా ఉందని, ఇప్పటికి నాలుగు గ్యారంటీలు పూర్తి చేయడం జరిగిందన్నారు. మరో రెండు గ్యారెంటీలు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామీణ ప్రాంతాలైన అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. షమీమా బేగం మన అందరికీ కన్నతల్లి లాంటిదని, ఆ తల్లిని గెలిపించుకుంటే కచ్చితంగా ఆమె కుమారుడు ఆమెకు అండగా ఉండే గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆమెతోపాటు కాంగ్రెస్ మద్దతుదారులైన వార్డు సభ్యులను కూడా గెలిపించాలని ఆయన మహిళలను కోరారు. మహిళలు తలుచుకుంటే తమ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థులు గెలిస్తే తిరిగి గ్రామానికి వచ్చి కృతజ్ఞతలు చెప్పుకుంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. గోరి బ్రదర్స్.. ప్రచారం అదుర్స్.. గోరీ బ్రదర్స్ అంటేనే ఏ విషయంలోనైనా ప్రత్యేకమే.. మారుమూల పల్లెలో ఉంటూనే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సోదరులు గ్రామంలో కూడా తమదైన ముద్ర వేశారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం గ్రామంలో భారీ ఎత్తున ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి కుమారుడు, ఆల్ ఇండియా కృష్ణా మహేష్ ప్రజాసేన అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరి మాట్లాడుతూ మొదటినుంచి తమ కుటుంబం గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచిందని గుర్తు చేశారు. తమను గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ అండతో, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాన్ని నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తమ తల్లి శమీమా బేగంను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒకసారి తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని తామందరము గ్రామానికి అండగా నిలబడతామని ఇంతవరకైనా అభివృద్ధి కోసం వెనకాడే ప్రసక్తే ఉండాలని గ్రామస్తులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని గోరి బ్రదర్స్ వివరించారు. ఈ ర్యాలీలో సిపిఐ నేత వార్డు సభ్యుడుగా పోటీ చేస్తున్న బుద్ధుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా మున్నూరుకాపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగ విజయవంతంగా జరపాలి

**..మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు పటేల్**
**..12న శామీర్‌పేట మండలంలో జిల్లా ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు**
**..ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వివరించిన వైనం**

**శామీర్‌పేట, డిసెంబరు9 ,ప్రభాతవార్త:** జిల్లా మున్నూరుకాపు సంఘం ఎన్నికలను ప్రశాంతంగ, విజయవంతంగా జరుపుకోవాలని, ఈ నెల 12వ తేదీన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మున్నూరుకాపు సంఘం కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం శామీర్‌పేటలోని ఉమ్మడి మండల ప్రెస్‌క్లబ్‌లో ఆయన ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద గల శుభం గార్డెన్‌లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి , ఈ జిల్లా ఎన్నికలు ఎన్నికల ఇన్‌చార్జి ఇందూరు తిరుపతిపటేల్ ఈ ఎన్నికలు నిర్వహిస్తారని అన్నారు. ఎన్నికలు సంఘం నిబంధనల ప్రకారం జరుగనున్నట్లు వివరించారు. జిల్లా గౌరవాధ్యక్షులు మామిండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ఎన్నికలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వాహణ వివరాలను ఆయన తెలియజేశారు. ఈ నెల 12న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఎన్నికల నిర్వాహణ ఉంటుందన్నారు. ఆ తరువాత భోజన కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత అదే రోజు ఆ వెంటనే విజయోత్సవసభ జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తంరావుపటేల్ వివరించారు. విజయోశ్చవ సభ విజయవంతం కొరకు జిల్లాలోని రాష్ట్ర పదాధికారులు, జిల్లా ముఖ్య నాయకులు, మండల, గ్రామాల అధ్యక్షులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వారితో పాటు రాష్ట్ర కార్యదర్శి కర్ర వెంకన్నపటేల్, రాష్ట్ర కార్యనిర్వాహఖ కార్యదర్శులు గోనె శ్రీనివాస్‌రావుపటేల్, ఆకుల సత్యనారాయణపటేల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.వెంకటేశ్వ ర్లుపటేల్, రాష్ట్ర నాయకులు వేల్పుల శ్రీనివాస్‌పటేల్, శామీర్‌పేట మండల అధ్యక్షులు చాట్లపల్లి నర్సింగ్‌రావుపటేల్,తదితరులు పాల్గొన్నారు,


శామీర్‌పేటలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు పటేల్,పాల్గొన్న జిల్లా నాయకుల దృశ్యం


అలియాబాద్‌లో శ్రీఅయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా జరిగిన దృశ్యం

## అలియాబాద్‌లో ఘనంగా జరిగిన శ్రీఅయ్యప్పస్వామి మహాపడి పూజ

**శామీర్‌పేట, డిసెంబరు9 ,ప్రభాతవార్త:** అలియాబాద్‌లో శ్రీఅయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమం ఘనంగా కన్నుల పండుగగా జరిగింది. శ్రీఅయ్యప్పమాలధార స్వాముల ఆటపాటలతో శ్రీఅయ్యప్పనామ స్మరణం మారుమోగింది. మంగళవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్‌లో సత్యం గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడి పూజా కార్యక్రమం జరిగింది. అలియాబాద్ గ్రామ స్వాములతో పాటు పరిసర గ్రామాల నుంచి స్వాములు పాల్గొని భక్తిశ్రద్దలతో పూజలు చేశారు. అలియాబాద్ గ్రామం నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్న చీర్ల తరుణ్‌స్వామిని ఘనంగా పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధార స్వాములు, గ్రామ ప్రజలు, పలువురు నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్‌టెర్మినల్ మీదుగా జిల్లా బస్సులు నడపాలని వినతి

**ఘట్‌కేసర్, డిసెంబరు9 ,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ బస్‌టెర్మినల్ మీదుగా జిల్లా బస్సులు నడపాలని జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి మంగళవారం యాదగిరి గుట్ట డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైల్వేగేటుపై వంతెన నిర్మాణం పనులు జరుగుతున్న కారణంగా జిల్లా బస్సులు పట్టణంలోకి రాకుండా బైపాస్ రహదారి మీదుగా వెళ్తున్నాయని తెలిపారు. ఆర్ఓబీ వంతెన పక్క నుంచి రోడ్డు వెడల్పు చేసి చదును చేయడంతో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయని జిల్లా బస్సు సర్వీసులు బస్‌టెర్మినల్ మీదుగా వచ్చి వెళ్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈమేరకు జేఏసీ కన్వీనర్ లక్ష్మారెడ్డి రాసిన వినతిపత్రాన్ని జేఏసీ సభ్యుల ద్వారా డిఎంకు అందజేశారు.

## మూగబోయిన ప్రచార రథాలు

**కొందుర్గు, డిసెంబరు 9, ప్రభాతవార్త :** గత వారం రోజుల నుండి మండలంలో మార్మోగిన సర్పంచ్ అభ్యర్థుల ప్రచార రథాలు మంగళవారం సాయంత్రం మూగబోయాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటా పోటీగా గత వారం రోజుల నుంచి ప్రచార రథాలతో పాటల రూపంలో విస్తృతంగా ప్రచారం చేశారు. మంగళవారం సాయంత్రం ప్రచార సమయము ముగిసింది. దాంతో వాహనాలకున్న అభ్యర్థుల బ్యానర్లను,మైకులను తొలగించారు. మైకులతో హోరెత్తిన మండల కేంద్రం మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది. మండల కేంద్రంతో పాటు పుల్సు మామిడి మహాదేవ పూర్, శ్రీరంగాపూర్, తంగళ్ళపల్లి, తదితర గ్రామాల్లో అభ్యర్థులు ప్రచార రాథా లతో నిర్వహించారు.

**భారీగా మద్యం కొనుగోలు**

గురువారం జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం నాడు మండల కేంద్రంలోని మద్యం దుకాణాల నుండి సర్పంచ్,వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న వారి స్నేహితులు, కార్యకర్తలు పోటాపోటిగా భారీగా మద్యం కొనుగోలు చేశారు . మద్యం దుకాణాల వద్ద మంగళవారం ఉదయం నుండి సందడి సందడిగా కనిపించింది. కొనుగోలు బాగా పెరగడంతో మద్యం దుకాణాలు ఖాళీ అయ్యాయి. మంగళవారం సాయంత్రం ఆబ్కారి శాఖ అధికారులు మద్యం దుకాణాలకు సీలు చేసి వెళ్లారు.

## జాతీయ సదస్సును విజయవంతం చేయండి

**-చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత**


మాట్లాడుతున్న చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత

**చేవెళ్ల, డిసెంబరు 9, ప్రభాతవార్త :** చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10,11న నిర్వహించే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలేకరులతో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత మాట్లాడుతూ ఈ నెల 10,11వ తేదిల్లో భారతదేశం ఎస్డీజీ-16 శాంతి, న్యాయం, సమానత్వం సమాజాలనఉ బలవర్చడం అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. అర్థిక శాస్త్ర విభాగం ఆద్వర్యంలో జరుగుతున్న జాతీయ సదస్సులో శాంతి, అధునిక సవాళ్లపై చర్చిండడానికి పండితులు ,విద్యావేత్తలు,వాధాన నిపుణులు పరిశోధకులను ఒకే వేదికపై తీసు కురావడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందని, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫేసర్ వి.బాలకిష్టారెడ్డి, మాజీ ఓఎస్ఓ ప్రెస్ కార్యదర్శి సత్యనారాయణ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ లంబాద్రిలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ మహ్మద్ అబ్దుల్ మాలిక్, కవిత,సూర్యనారాయణ,షాజహన్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.



## చివరి రోజు జోష్ ఫుల్ గా ప్రచారాలు

**శంషాబాద్ మండలంలో ముగిసిన పంచాయతీ ప్రచార పర్వం**

**రంగారెడ్డి(శంషాబాద్), డిసెంబరు9, ప్రభాతవార్త:** శంషాబాద్ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల స్థానిక సంస్థల తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచార పర్వం మంగళవారంతో ముగిసింది. మండలంలోని ముచ్చంతల్, పెద్ద షాపూర్ తండా, పెద్ద తూప్రా, పెదతూప్ర తండా తదితర గ్రామాల పంచాయతీలలో అభ్యర్థులు, వారికి మద్దతుగా మండల ,నియోజకవర్గ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముచింతలలో కత్తుల సుభాష్, పెద్ద తూప్రాలో చిటికెల పద్మా వెంకటయ్య, అంకం సుమలత రాజు యాదవ్,దుద్యాల శారద యాదయ్య, పెద్ద షాపూర్ తండాలో రవి నాయక్ , పెద్ద తూప్రా తండాలో బిక్య నాయక్ పాటు సీనియర్ నాయకులు, విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పెదతు ప్ర పంచాయితీలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని పార్టీ విధానాలు వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని అభ్యర్థులు హామీలు ఇచ్చారు. టిఆర్ఎస్, కాంగ్రెస్ దుష్ప్రచారాలను ఓటర్లు పట్టించుకోవద్దని సూచించారు.

## ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**-రోగులకు పండ్లు పంపిణీ**


ఘట్‌కేసర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో మంగళవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు-రాజ్యసభసభ్యురాలు సోనియాగాంధీ 79వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాసవీటవర్స్ ఆవరణలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌లు పాల్గొని కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సోనియాగాంధీ త్యాగశీలి అన్ని ఆమె చొరవతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగిందని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, ఆర్‌బిఎస్ మాజీ సమ వ్యయకర్త కొంతం అంజిరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరక్టర్ చిల్మూరి మచ్చేంధర్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ గోపు బాల్‌రాజ్‌యాదవ్, మున్సిపల్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రహమాన్, మాజీ ఉపసర్పచ్ కొంతం బాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు విబి.వెంకటనారాయణ, మెట్టు రమేశ్, కొమురవెల్లి ఆలయ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.ఎ.ఫారూఖ్, సేవాదళ్ అధ్యక్షులు రాజారత్నం, నాయకులు నర్సింగ్‌రావు, అబ్దుల్‌ఖయ్యూమ్, రఫియుద్దిన్, రాజు, అనిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



అన్నోజిగూడలో ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌కట్‌చేసి వేడుకలు జరుపుకుంటున్న బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్ తదితరులు

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సోనియా గాంధి పాత్ర కీలకం

**: బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ గౌడ్**

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ కీలకపాత్ర వహించారని బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్ అన్నారు. ఎల్‌బి నగర్ జోన్ పోచారం సర్కిల్ పరిధిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు రాష్ట్రాభివృద్ధిలో సోనియా గాంధీ చేసిన సేవలను కాంగ్రెస్ శ్రేణులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోచారం సర్కిల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్, ఉపాధ్యక్షుడు బద్రీహేమంత్, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏర్ర రాజు, మహిళా అధ్యక్షురాలు ఏర్ర మాధవి, లక్ష్మీ, లింగం యాదవ్, కొంతం శంకర్ రెడ్డి, నరేశ్ గౌడ్, మెట్టు రమేశ్, సతీశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు అవగాహన సదస్సు

**మేడ్చల్, నవంబరు 9. ప్రభాతవార్త :** ఆరోగ్యవంతమైన పండంటి బిడ్డకు జన్మనిచ్చేందుకు గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్య జననీ, స్వామి వివేకానంద ఆరోగ్య కేంద్రం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలోని జంగలక్ష్మయ్య కళ్యాణ మండపంలో శ్రీ పాద వల్లభ ట్రస్టు సహకారం మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ అంజలి, యోగ నిపుణులు మాధవి, న్యూట్రిషన్ స్పెషలిస్టు దీప్తి గర్భిణీ స్త్రీలకు అర్థమయ్యేలా వివరించారు. అనంతరం యోగాసనాలు చేయించి బంగారు బిడ్డకు జన్మ నివ్వాలని డాక్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాద వల్లభ ట్రస్టు చైర్మన్ రమేష్ గుప్తా, నాయకులు శ్రావణ్ గుప్తా, శాంతన్ గుప్తా, నరేందర్ గుప్తా, నరేంద్రచారి, నర్సింహ్లు పటేల్, ఐసిడిఎస్ సిడిపిఓ స్వర్ణలత, అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమావతి, అంగన్‌వాడి టీచర్లు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అంజలి

## అన్నోజిగూడలో అగ్ని ప్రమాదం ఒకరికి గాయాలు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** లీలా కూలర్ షాపులో గ్యాస్ సిలెండర్ లీకై మంటలు అంటుకోవడంతో షాపు దగ్ధం కాగా ఒకరికి స్వల్పంగా గాయలైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడలో మంగళవారం చోటుచేసుకుంది. సంఘటన వివరాలు పోచారం ఐటీ కారిడార్ పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. అన్నోజిగూడ ఎన్‌టీపీసీ చౌరాస్తాలో కూలర్ షాపులో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు 100 దయల్ నెంబర్ ద్వారా కాల్ రాగా ఎస్సై కృష్ణయ్య ఆధ్వరనయంలో పోలీస్‌సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని ఫైర్ ఇంజిన్ రప్పించి షాపులో చేలరేగిన మంటలను ఆర్పించినట్లు తెలిపారు. షాపులో షాపు యాజమాని రాజేశ్ ( 36 ) భోజనం తయారు చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించినట్లు తెలిపారు. షాపులో సామాగ్రి దగ్ధం అయ్యినట్లు పోలీసులు తెలిపారు. షాపు యాజమాని రాజేశ్‌కు స్వల్పంగా గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.



అన్నోజిగూడ కూలర్‌షాపులో అగ్నిప్రమాదం జరగడంతో ఫైర్ ఇంజిన్ సిబ్బంది మంటలు ఆర్పుతున్న దృశ్యం

## అనుక్షణం జర్నలిస్టులకు అందుబాటులో ఉంటా

**వేణు గౌడ్**

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా జి. వేణుగౌడ్ నియమితులైనట్లు ఆ సంఘం నాయకులు మంగళవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్రఅధ్యక్షుడు సోమయ్య మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులుగా వేణు గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారిచేసినట్లు తెలిపారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన వేణుగౌడ్ మాట్లాడుతూ అనుక్షణం జర్నలిస్టులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇండ్లస్థలాలు అందేవిధంగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, టి. రాములు, భాగ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారులకు శిక్షణ

**చౌదపూర్ ,డిసెంబరు 9, ప్రభాత వార్త:** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించేలా సజావుగా జరిగేలా చూడాలని ప్రొసీడింగ్ అధికారులకు, ఎన్నికల సిబ్బందికి రిసోర్స్ పర్సన్ నరసింహా రావు శిక్షణ ఇచ్చారు. మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఉమేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని రైతు వేదికలో నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ సోమలింగం, ఎంపీఓ రాజి రెడ్డి, సూపర్వైజర్ రమేష్ , ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు .



శిక్షణలో పాల్గొన్న అధికారులు

## జాతీయ సెమినార్‌కు డాక్టర్ సామ రవీందర్ రెడ్డి

**షాద్‌నగర్,డిసెంబరు 9, ప్రభాత వార్త:** రేపు ఉస్మానియా యూనివర్సిటీ పరిధిఎస్ ఎస్ ఆర్ సహకారంతో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ డి జీ (సస్టే న బుల్ డెవలప్మెంట్ గోల్ స్)16 పై జరుగుతున్న జాతీయ సెమినార్ కు షాద్ నగర్ కు చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ఆహ్వానం అందుకున్నాడు. ఈ సెమినార్ లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వివిధ విశ్వ విద్యాలయాల నుండి ప్రొఫెసర్లు ,అసిస్టెంట్ ప్రొఫెసర్లు , పరిశోధకులు వారి వారి పరిశోధన పత్రాలను సమర్పించబోతున్నారు. ఈ సెమినార్ దేశ సమగ్రత లోక తంత్ర పరిపాలన, సంస్థాగత బలోపేతం ఆధారంగా జాతీయస్థాయిలో విజ్ఞానాన్ని, పరిశోధన అంశాలను పంచుకునే వేదికగా నిలుస్తుంది. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెమినార్ లో భారత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసేటువంటి అంశాల పైన పరిశోధన పత్రాలు సమర్పించడం జరుగుతుంది. డాక్టర్ సామ రవీందర్ రెడ్డి కాలుష్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థలు ఏ అంశాలపై ప్రభావం పడుతుంది దాని నివారణ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించబోతున్నాడు. ఈ నేపథ్యంలో రాజేంద్ర నగర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని అలా ఉన్నవారే బోధనలో ఉన్నత స్థాయిలో ఉంటారని,జాతీయ సెమినార్కు వెళ్తున్న డాక్టర్ రవీందర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు,మరియు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.



## నేటి నుండి ఆంజనేయస్వామి జాతర

**దుద్యాల్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** మండలంలోని చిల్ముల్ మైలారం గ్రామ ఆటవీ ప్రాంతంలో కొలువుదీరిన మామిడికుంట ఆంజనేయస్వామి జాతర బుధవారం నుంచి ప్రారంభం కా నుంది. నేడు స్వామివారి రథోత్సవం, గురువారం పెద్ద జాతర ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం స్వామివారికి పల్లకీ సేవ, సాయంత్రం పెరుగు బసంతం కార్యక్రమాలు నిర్వహించ న్నట్లు ఆలయ పూజారి రాఘవేంద్రచారీ, ధర్మకర్తలు రామారావు దేశ్ పాండే, పురుషోత్తం దేశ్ పాండే తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాల ు విజయవంతం చేయాలని వారు కోరారు.



మామిడికుంట ఆంజనేయ స్వామి దేవాలయం

# ఘనంగా బోనమ్మ జాతర

**కొడంగల్,డిసెంబరు 9, ప్రభాత వార్త:** భక్తుల కొంగుబంగారంగా వెలుగొందు తున్న బోనమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో వెలసిన బోనమ్మ జాతర మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రుద్రారం, నీళ్ళపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తలపై బోనాలతో అమ్మవారి ఆల యానికి చేరుకొని ఆలయం చుట్టు ప్రదక్షిణలతో మొక్కులు చెల్లించు కున్నారు. అలాగే కోడిపుంజులు, మేకలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిం చారు. అలాగే రాత్రి వేళల్లో భజన కార్యక్రమంతో హోరెత్తించారు. జాతర ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



అమ్మవారికి బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

# తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ

**..కాంగ్రెస్ నాయకుల సంబరాలు**
**..శామీర్‌పేట ఉమ్మడి మండలంలో జరిగిన సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు**

**శామీర్‌పేట, డిసెంబరు 9, ప్రభాత వార్త:** తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ మరింత అభివృద్ధి జరుగుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని మజీద్‌పూర్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఏఐసిసి అధినేత్రి సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ను కట్ చేసి కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీని తెలంగాణ ప్రజలు మరువలేరని పలువురు నాయకులు కొనియాడారు. సిఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి జరిగి మరింత అభివృద్ధి పథంలోకి వెళ్లనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మేడ్చల్ ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తుంకి మల్లేశ్, మాజీ సర్పంచులు ఎల మల్లేశ్, కె.కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎ.భాస్కర్‌గౌడ్, కె.నర్మద, భూమిరెడ్డి, నవీన్‌రెడ్డి, జి.నర్సింగ్‌రావుగౌడ్, ఎ.జగదీశ్వర్‌గౌడ్, ఊరడి వెంకటేశ, చిలుగురి మల్లేశ్, చాట్లపల్లి నర్సింగ్‌రావు, జె.బన్సిలాల్, ఎస్.శంకర్, ఎం.వీరారెడ్డి, కె.వెంకటేశ, ఎన్.వెంకటయ్య, ఎ.నారాయణస్వామి, ఎన్.బాలేశ్, ఎ.వినోద్, జి.యాదగిరి, టి.సాయిబాబు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ..ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియగాంధీ పుట్టిన రోజు వేడుకలను మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు,జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి కేక్‌ను కట్ చేసి బాణసంచాలు కాల్చి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. తెలంగాణకు సోనియగాంధీ అందించిన సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ పి.లక్ష్మినారాయణ, ధర్మకర్తలు వి.మురళిగౌడ్, ఎన్.హరిగోపాల్, మాజీ కౌన్సిలర్ ఎస్.మదుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌యాదవ్, నాయకులు టి.మురళిగౌడ్, పి.ధర్మారెడ్డి, ఎండి జాఫర్, టి.ఆర్.రవీందర్‌గౌడ్, టి.దర్శన్‌గౌడ్, ఎస్.దుర్గయ్య, వి.శశాంత్,జి.బాబు, ఎం.బిక్షపతి, బి.జనార్ధన్‌రెడ్డి, జి.ప్రదీప్‌కుమార్, ఎండి గౌస్‌పాష, ఎన్.మధుసూదన్‌రెడ్డి, టి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సాయికుమార్, ఎన్.శ్రీనివాస్, ఎస్.బాల్‌రాజు, భరత్ కుమార్, ఎస్.దీపికారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ..మూడు చింతలపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, ఏఐసిసి నాయకురాలు సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌లను కట్‌చేసి భాణసంచాలు కాల్చి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, నియోజకవర్గ ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు,భస్వారెడ్డి, జైపాల్‌రెడ్డి, జగన్నాధం,కోల అంజయ్య, బాలనర్సింహ్మా, యాదగిరి, అఖిలేశ్‌రెడ్డి, వెంకటేశం, వెంకటరమణరెడ్డి, వైద్యనాథ్, వీరేశంగుప్తా, మహేశ్, రాజేంద్రప్రసాద్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్, వెంకటేశ, శేఖర్, బండి రవి, నర్సారెడ్డి, శ్రీనాథ్, రాజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నవీన్, శ్రీకాంత్‌గౌడ్, పలువురునాయకులు పాల్గొన్నారు.



తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం



మూడుచింతలపల్లిలో సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం

# గ్రామకంఠం భూములు ప్రైవేటీకరించొద్దు..

**దుద్యాల్, డిసెంబరు 09, ప్రభాతవార్త:** గ్రామకంఠం భూముల ు ప్రవేటికరించొద్దు. తక్షణమే లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల ు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ, దుద్యాల్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వము దాదాపు 12796 గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ కంఠం భూముల ు 30 ఏళ్ల పాటు ఐఓఆర్ఏ ఏకో లాజికల్ సొల్యూషన్ ప్రైవేటు సంస్థకు అప్పజెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గ్రామాల్లో పాలక మండల్లు లేని సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వం నిరభ్యంతర పత్రాల ు తీసుకోవాలని అనడం అప్రజాస్వామీకమన్నారు. వేలాది కోట్ల ఆస్తుల ు ఒకే ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పడం వె ఎక భారీ కుంభకోణం ఉన్నట్లు సందేహాలు వస్తున్నాయని, ఇలాంటి ఒప్పందం ప్రజాస్వామ్యానికి రాజ్యాంగంలోని 73వ సవరణ స్ఫూర్తి కి పూర్తిగా విరుద్ధనీ అని తక్షణమే విరమించుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది అన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు హరిత సౌభాగ్యం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రంలోని గ్రామకంఠం. భూములను ఢిల్లీకి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీకి కట్టబెడితే గ్రామపంచాయతీలు తమ హక్కుల ు కోల్పోవాల్సి వస్తుందని, గ్రామాలకు రావలసిన ఆదాయం కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీపివల్ల భవిష్యత్తు తరాలకోసం ప్రభుత్వ పాఠశాలలు. కమ్యూనిటీ హాల్‌లు పేదల స్మశానవాటికలు. స్మశాన వాటికలు పేదల పునరావాసం. తదితర ప్రజా అవసరాలకు భూములు లేకుండా పోతాయని అన్నారు. భూముల విలువ ఆకాశాన్ని అంటుతున్న నేపంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని. తక్షణమే రద్దు చేసుకొని గ్రామపంచాయతీలకే పూర్తి హక్కులు ఉండేలా చూడాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ప్రతాప్ రెడ్డి, యాదయ్య, పకీరప్ప, మహేష్, సాయిలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

# ఎన్నికల యుద్ధం.. అధికారులు సన్నద్ధం..



**షాద్‌నగర్,డిసెంబరు09,ప్రభాతవార్త:** సర్పంచ్ ఎన్నికల యుద్ధానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.. నియోజకవర్గంలో 153 గ్రామపంచాయతీలలో ఎన్నికల నిర్వహ కార్యక్రమం సిబ్బందిలకి విధులు కేటాయించే కార్యక్రమం నియోజకవర్గంలోని ఆరు మండలాలలో కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన సామాగ్రి ఆయా మండల పరిషత్ కార్యాలయాలకు ఇప్పటికే చేరుకుంది. ఫరూక్ నగర్ మండలాన్నే తీసుకుంటే ఇక్కడ 47 గ్రామపంచాయతీలకు 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించి మొత్తం 410 పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేశారు. ఆయా స్టేషన్లకు సంబంధించి 553 మంది పిఓలు, 553 మంది ఓపీవోలు పనిచేస్తున్నారు. ఇక 12 మంది రూట్ ఆఫీసర్లు, నలుగురు జోన్ ఆఫీసర్లు కూడా ఈ మండలానికి కేటాయించబడ్డారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ఆర్వోను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. 410 పోలింగ్ స్టేషన్ల లో అయ్యవారిపల్లి ఏకగ్రీవం కావడంతో ఐదు పోలింగ్ స్టేషన్ లు రద్దు చేయబడ్డాయి. ఇక 12 రూట్లలో 35 బస్సులను విధులను నిర్వహించే సిబ్బంది కోసం ఏర్పాటు చేశారు. బుధవారం సిబ్బందులకు విధులు కేటాయిం చడం జరుగుతుందని, ఇప్పటికే వారికి అనుమతి పత్రాలు అందజేయడం జరిగిందని ఎంఎ ీ డీవో బన్సీలాల్ వెల్లడించారు. పోలీసుల సహకారంతో ఎన్ని కలు అన్ని విధాల ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటా మని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఫరూక్ నగర్ మండలంలో 500 మందితో బందోబస్తు ఫరుక్ నగర్ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మొత్తం 15 పోలింగ్ కేంద్రాలు అదేవిధంగా 410 పోలింగ్ స్టేషన్లలో మొత్తం 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు షాద్ నగర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇద్దరు ఏసీపీలు, 6 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు మిగతా సిబ్బంది మొత్తం 500 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సిఐ తెలిపారు.



శామీర్‌పేటలో బిఆర్ఎస్ నాయకులు దీక్షా విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి మాజీ సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ ఆర్.మదుకర్‌రెడ్డి, అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి,పలువురు నాయకుల దృశ్యం

## శామీర్‌పేటలో బిఆర్ఎస్ దీక్షా దివస్

**..మాజీ సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం**

**శామీర్‌పేట, డిసెంబరు 9, ప్రభాత వార్త:** శామీర్‌పేటలో బిఆర్ఎస్ నాయకులు దీక్షా విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి మాజీ ఎంసి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం శామీర్‌పేటలో దీక్షా విజయ్ దివస్ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం కోసం బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సిఎం కెసిఆర్ అమరణ నిరహారదీక్ష చేపట్టి డిసెంబరు 9 దీక్ష విరమించిన రోజుగా దీక్ష విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందన్నారు. కెసిఆర్ అమరణ నిరాహారదీక్ష చేయటం వల్లనే నాడు తెలంగాణ రాష్ట్రం వచ్చిందని బిఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సొసైటీ చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి,శామీర్‌పేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు సతీష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, మాజీ సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి, సొసైటీ డైరక్టర్లు బిక్షపతి, భూమిరెడ్డి,నాయకులు నాగరాజుగుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, బాబు, దత్తుగౌడ్, సత్యనారాయణ, పవన్, నవీన్, చాంద్‌పాష, చింటూ, నాగార్జునరెడ్డి, జహంగీర్, నాగరాజు, రత్నం, పాల్గొన్నారు.

## కెసిఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది

**-చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు**



మాజీ సిఎం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు

**చేవెళ్ల,డిసెంబరు 9, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర తోలి ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన అమరణదిక్షతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రకటన సందర్భంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూల మాలలు వెసి నివాళులర్పించారు. అనంతరం కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజని, కెసిఆర్ అమరణ నిరహర దీక్ష చేపట్టి అప్పటి కేంద్ర ప్రభుత్వంను స్పందింప చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటిటింప జెసిందన్నారు. పదేళ్ల పాటు కెసిఆర్ సిఎం గా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. ఇచ్చిన హమిలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ పబ్బం గడుపుతుందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర సాధనలో అమరులైనన ప్రతి ఒక్కరిని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, చేవెళ్ల సహకార సంఘం మాజీ డైరెక్టర్ నత్తి క్రిష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ బ్యాగరి నర్సింలు, మండల సర్పంచుల సంఘం మాజీ అద్యక్షుడు శివారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్‌లు మంగళి వెంకటేశ్, చాకలి క్రిష్ణా, అబ్దుల్ గని, మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, నాయకులు మాణిక్యరెడ్డి, ప్రభాకర్, చందు, మాల సత్తయ్య, గుండెన్నోళ్ల మాణిక్యం, దండు సత్తి తదితరులు పాల్గోన్నారు.



చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న చేవెళ్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు

**కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో**

## తెలంగాణను సాధించిన గొప్ప నేత

**షాద్‌నగర్,డిసెంబరు 9, ప్రభాత వార్త:** తెలంగాణ ఉద్యమకారులు కేసీఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో మాజీ సీఎం కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలని షాద్ నగర్ బిఆర్ఎస్ నేతలు గుర్తు చేశారు. డిసెంబర్ 9 దీక్షా విజయ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం నాడు కేసీఆర్ చేపట్టిన అమరణ నిరాహారదీక్ష తీరును గుర్తు చేస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తీరును వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలను, భాషను, యాసను సంస్కృతిని కించపరిచే విధంగా, అవమానించే విధంగా అప్పటి నేతలు ప్రవర్తించారని, తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతున్న ఉమ్మడి పాలకులు నోరు మెదపలేదని గతాన్ని గుర్తు చేశారు. స్వరాష్ట్రాన్ని సాధించుకుంటేనే మన ప్రాంత ప్రజలకు న్యాయం జరుగుతుందని భావించిన కేసీఆర్, తన ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని, దాని ఫలితమే నాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును స్వాగతించని పలువురు తెలంగాణ ద్రోహులు, అప్పటి సీమాంధ్ర నేతలు కృత్రిమ ఉద్యమాన్ని సృష్టించి వచ్చిన తెలంగాణను అడ్డుకున్నారని చెప్పారు. అయినప్పటికీ కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించుకొని పదేళ్లపాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజ్, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నాయకులు రవి యాదవ్, వెంకట్రాం రెడ్డి, పిల్లి శేఖర్, ఒగ్గు కిషోర్, జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, లంకాల రాఘవేందర్ రెడ్డి, నందిగామ శ్రీనివాస్, రాఘవేందర్, భువనేశ్వర్ రెడ్డి, శివ ఎస్పీ, కంది రాఘవేందర్, నవీన్ దుమ్మని, శీలం శ్రీకాంత్, రాజశేఖర్, సిద్ధు, అభిలాష్, మహిళా నాయకురాలు ఉమారాణి, విజయమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఇంత అరాచకం ఎప్పుడూ చూడలేదని కృష్ణ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వేచ్ఛ ప్రకారం ఎవరికైనా ప్రచారం చేసుకుంటానని ఇవి పార్టీ ఎన్నికలు కావని, అనవసరంగా తనపై దాడి చేశారని వాపోయారు. కృష్ణయాదవ్ నుంచి తమకు ఫిర్యాదు అందిందని, శాంతి భద్రతకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నామని సిఐ చెప్పారు.

## పిడిఎస్ కేసు ఎత్తేయాలా..రూ.20 వేలు ఇచ్చుకో

(మొదటి పేజీ తరువాయి)

క్వింటాలుకు ఐదు కిలోల వరకు బియ్యం తక్కువ వస్తుందని అలా పాత బియ్యం మిషన్లో రెండు క్వింటాళ్ల లెక్క సరిపోకపోవడంతో తన షాపు సీసీ చేయడం జరిగిందని ఈ లెక్కను సరి చేయడానికి 20వేల రూపాయలు లంచం అడిగినట్లు యాదగిరి తెలిపారు. అధికారి వేధింపులు ఎక్కువగా ఉండటంతో ఏసీబీని ఆశ్రయించినట్లు యాదగిరి తెలిపారు.

## ఆఖరి ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రంతో ప్రచారానికి తెర పడడంతో ఇక ప్రలోభాలకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎక్కడ తమకు అనుమానం కలిగిన వ్యక్తులను రహస్యంగా కలుస్తు వారికి డబ్బు, మద్యంతో పాటు ఏది కావాలన్నా వాటిని సమకూర్చేందుకు వెనుకాడడం లేదు. పలు గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల కోసం పోటీ చేస్తున్న అభ్యర్థులు ఏకంగా పొలాలను విక్రయిస్తు వచ్చిన డబ్బులతో ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రెండు రోజులు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందవారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్‌లు హస్నాబాద్, పర్సాపూర్, చిన్ననందిగామ, అంగడిరైచూర్, రుద్రారం తదితర గ్రామాల్లో తమ పార్టీ మద్దతుదారులకు ముమ్మరంగా ప్రచారాలు నిర్వహించగా బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి రుద్రారం, అంగడిరైచూర్, రావులపల్లి తదితర గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గెలుపు ఓటములపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఎన్నికల ఫలితాలు వెలువడాలంటే మరికొన్న గంటలు అగాల్సిందే మరి.